కథ

# కానుక

- అరుణ నిష్ఠల

ఆ ఇంటిగేటు ముందు జెన్ అగడంతో ఆ కుటుంబ సభ్యులు పెద్దగా ఆశ్చర్య పోలేదు. పెద్దింటికి ఎవరో వచ్చారనుకున్నారు. కానీ యూనీఫాం వేసుకున్న డ్రైవరు నేరుగా ఔటు హౌసు వద్దకు వచ్చి "సూర్యం గారిల్లు ఇదేనా" అని అని అడగడంతో అపుడు విస్మయంగా కారువైపు చూసారు 'ఎవరు' అని అనుకుంటూ.

లోవర్ మిడిల్ క్లాసు స్థాయి చిరుద్యోగం, కంపెనీ మానేజర్ ఆదరంగా ఉట్టినే ఉండమని అద్దె అక్కరలేదని ఇచ్చిన ఔట్‌హౌస్, పెళ్ళికెదిగిన పిల్ల, గయ్యాళీ భార్య గయ్యాళీ తల్లి ఎపుడో తండ్రి వ్యసనాలకు కరిగిపోయిన ఆస్థిలో, తగాదాలలో ఉండ బట్టి మిగిలిపోయిన ఎకరం పొలం అతి మంచితనం సూర్యం జీవితంలో బల వంతంగా పెనవేసుకున్నవీ విడదీయలేనివి.

డ్రైవరు తలుపు తీయగా చిరునవ్వు మొహంతో దిగిన ఆమె చక్కని శరీర సౌష్టవంతో, కట్టుకున్న బ్లూ కాశ్మీరు సిల్కు చీరకి అందం వచ్చిందా అన్నట్లున్న మేనిచ్ఛాయతో దేవలోకంలో విహరిస్తూ ఒకసారి భూలోకం ఎలా ఉంటుందో అని కుతూహలంగా తొంగిచూసి పోబోయే దేవకన్యలా అనిపించింది అందరికి. దగ్గరగా వచ్చాకా తెలిసింది సూర్యానికి. ఆమె జయ. లక్షాధికార్ల పిల్ల. ఒకనాడు తనను ప్రేమించి తనను వేధించి తను కాదంటే తనను పెళ్ళి చేసుకోలేకపోయిన జయ. తన మనసులో వున్న రూపుకీ ఈ రూపుకీ కాలం తెచ్చి పెట్టిన మార్పులలో ముఖ్యమైనది అది వరకటి కంటే అధునాతనమైన అలంకరణ మరింత అందాన్ని తెచ్చిపెడుతోంది. మేకప్ వేసుకున్నా వేసుకోనట్లు కనిపించే సహజమైన అలంకరణ.

చిరునవ్వుతో వస్తున్న జయను ఆదరంగా ఆహ్వానించాడు సూర్యం. పరిచయాలు పూర్తి అయాక సూర్యం భార్య సునంద మాడు ముఖంతో కాఫీ టిఫెను తీసుకువచ్చింది. తన భర్తకు అంత అందమైన డబ్బున్న పిల్ల భార్య కాబోయి ఆ పిల్ల అదృష్టవశాత్తు తన భర్త దురదృష్టవశాత్తు తప్పిపోయిన పిల్లా? పిల్లేమిటి? దాదాపు నలభై ఏళ్ళు దాటాయేమో! అయినా అంత అందంగా ఎలా ఉందో?

మెడలో చెవులకీ చేతులకీ ఉన్న ఆభరణాలు కదుల్తూ మాట్లాడుతూంటే మెరిసిపోతూ జయ మాట్లాడు తోంది తియ్యగా. అదో పెద్ద అనుభూతిలా ఉంది అక్కడే కూర్చుని చూస్తున్న సూర్యం కూతురికి. 'ఎవరూ' అంటూ నుదిటిన చెయ్యి ఆనించి కళ్ళకు పైన అడ్డం పెట్టుకుని చూస్తోంది సూర్యం తల్లి.

'ఎలా తెలిసింది నీ అడ్రసు అని అడగకు. నాకు ఉత్తరాలు వ్రాయని వాడివి నీ కెందుకు చెప్పాలి? అవునా పాపా? నీ పేరేమిటి?' అక్కడున్న సూర్యం కూతురితో నవ్వుతూ అంటోంది జయలక్ష్మి.

"జయలక్ష్మి" ఆస్తులు అంతస్థులు ఉంటేనే మనుషులు ఆదరిస్తారన్న భ్రమ పసితనం వీడని ఆమె జయ ప్రవర్తనకు మాటలకు కాస్తంత ఆశ్చర్యపడుతూనే జవాబిచ్చింది.

'నీ పెళ్ళికి బహుమానంగా' చేతిలో పాకట్ విప్పి సన్నటి జరీ అంచు ఉన్న పాల మీగడ రంగు ఎర్రంచు పట్టుచీర, జాకెట్ గుడ్డ జయ ఆ పిల్ల చేతిలో పెట్టింది.

"ఇపుడెందుకు జయా అవన్నీ" సూర్యం మొహమాటపడ్డాడు, సునందకి అపుడే అర్థం అయింది జయలక్ష్మి పేరు పెట్టాలి పిల్లకి అని భర్త ఎందుకు పట్టు పట్టాడో!

"మీ వారేం చేస్తారు? ఎంతమంది పిల్లలు..." సూర్యం అడగబోతున్నాడు. "ఎదరుగుండా భూతంలా నేనుంటే నా గురించి అడగవా? వాళ్ళ సంగతిఎందుకు?" జయ నవ్వుతూ అంది.

జయ తండ్రికి తన నిశ్చయం స్పష్టంగా చెప్పడంతో వేరే సంబంధాలు చూడటం సెటిల్ అవవచ్చు అనుకోవడం తనకు తెలుసు. ఆ తరువాత తనకు ఉద్యోగం రావడంతో దూరంగా వెళ్ళిపోయాడు. ఆవేళ జయతో శాశ్వతంగా తెగతెంపులు చేసుకోవాలి అని అనుకున్నపుడు తన మనసు హఠం చేసింది. అపుడే వెళ్ళి జయ ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని 'ఈ పెళ్ళి నాకిష్టమే' అని చెప్పాలనిపించింది. వర్తమానం కంటే మనష్యుల్ని హడల గొట్టేది భవిష్యత్ . ఎపుడు ఏం జరుగుతుందో తెలియని భవిష్యత్ కోసం మనిషి చాలా చాలా పోగొట్టుకుంటాడు అనిపించింది సూర్యానికి. ఆ భవిష్యత్ కోసం తను జయను పోగొట్టుకున్నాడు.

"నిన్నే సూర్యం" ఉలికిపడి జయ దెసగా చూసాడు సూర్యం.

"ఏమిటి"

"నీ పెళ్ళికి నన్ను పిలవలేదు నీకేం శిక్ష వేయాలో చెప్పు" అధరాలపై నవ్వు ఆమె ముఖాన్ని అంతటినీ వెలుగుమయం చేస్తోంది, వెలిసి పోయినట్టున్న ఇంట్లో కట్టుడు చీరతో వున్న సునందకి ఆమె ఎదురుగా కూర్చొని మాట్లాడాలంటే ఎంత అసహనంగా ఉందో అంతకు రెట్టింపు అభిమానంగా పాత బనీను లుంగీతో అరమరిక లేకుండా సూర్యం మాట్లాడుతున్నాడు. ఆవిడ ఎప్పుడూ వెళ్లిపోతుందా అని ముళ్ళమీద కూర్చునట్లు ఎదురు చూడసాగింది.

గట్టిగా గంట కూడా అవలేదు "వెళ్తాను సూర్యం ఇలాగే బుద్ధిపుడితే వచ్చి చూసి వెళ్తాను. మా ఇంటికి రమ్మని మాత్రం అనను. ఎందుకో తెలుసా "జయ ఒక క్షణం సునందవైపు చూసింది. "చెప్పనులే! ఉడుక్కుంటావు" జల తరంగిణి మ్రోగించినట్లు కిలకిలా నవ్వింది జయ.

వెళ్తూంటే గమనించింది సునంద. ఆమె చెప్పులు వేసుకోవడానికి గుమ్మం దగ్గర ఆగకుండానే సూర్యంతో ఏదో మాట్లాడుతూ కారువైపు వెళ్తోంది. అయితే ఆమె చెప్పులు విడవలేదా? ఎంత పొగరు డబ్బుంటే మాత్రం....కారులో వస్తే మాత్రం .... సునందకి ఒళ్ళుమండింది.

'సూర్యం బజారుదాకా అలా వస్తావా' ఉన్నట్లుండి అడిగింది జయ, 'ఒక నిమిషం' అంటూ వెనుదిరిగి ఇంట్లోకి వచ్చి లాల్చీ షరాయి వేసుకుని వచ్చాడు.

'నీ వేషం అప్పటికీ ఇప్పటికీ ఒకటే' నవ్వింది జయ. ముత్యాల్లాంటి పలువరస చక్కని షేపు గల పెదవుల మధ్య తళుక్కు మంటున్నాయి. దూరాన గుమ్మంలోంచి చూస్తున్న సునంద "ఈవిడ మాట మాటకీ నవ్వాలా? పళ్ళు ఎంత అందంగా ఉన్నాయో లిప్‌స్టిక్ వేసుక్ను అందమైన పెదవుల వైపు అందరినీ ఆకర్షించేందుకు అదో ఎత్తు" అనుకుంటూ తన ఎత్తుపళ్ళు కనిపించకుండా బలవంతాన పెదవులు మూసుకుంది సునంద.

కారులో వాళ్ళిద్దరూ వెళ్తూంటే ఆమె కళ్ళలో ఈర్ష్య వాళ్ళని వెంటాడింది చూపు అందినంత మేరా.

'ఎంత బాగుందో ఈ చీర పాముకుబుసంలా' చీర మెత్తదనాన్ని చేతి వేళ్ళతో పరీక్షిస్తున్న సూర్యం కూతురు తల్లి రుసరుసలకి తల ఎత్తి చూసింది. "లే! అలా మైమరచిపోతున్నావేమిటి ఆ చీర చూస్తూ" అంటోంది సునంద.

* * *

ఎన్నెన్నో చెప్పాలని ఇద్దరికీ ఉంది. మనస్సు నిండిపోయినపుడూ భావానికి భాషరాక కొట్టుకునే క్షణాలలో ఆ నిశ్శబ్దం ఇద్దరి మధ్యా ఎంతో సంభాషణ జరిగిన దాని కన్నా ఎక్కువ ప్రాముఖ్యం వహిస్తుంది. ఇన్నాళ్ళ తరువాత కలుసుకున్నా ఇద్దరికీ మధ్యనున్న దూరం వాళ్ళని పెద్దగా బాధిస్తున్నట్లు లేదు. ఒకరిపట్ల ఒకరి కున్న ఆరాధనకు కాలాన్ని కూడా చెరిపేయగల శక్తి ఉంది. పదినిమిషాలు పూర్తిగా కాలేదు బజారు రానే వచ్చింది.

"కారాపు సతీష్" అంది డ్రైవరుతో.


"సూర్యం"

జయ కళ్ళలోకి చూసాడు సూర్యం. అది నీటిపొరా? లేక నీలి కళ్ళలో తళుకా? కనుచీకటిలో చిన్న వెలుగులో కనిపించలేదు అతడికి సరిగ్గా. బాగ్ లోంచి ఒక కవరు తీసి "ఇది ఇంటికి వెళ్ళాకా విప్పుతావు కదూ" అంటూ చేతిలో ఉంచింది.

ఆ మాటలు ఆమె గుండె లోతులనుంచి వస్తున్నట్లు ఆమె కళ్ళలో అతడి పట్ల అభిమానం, నమ్మకం భరించడానికి సూర్యం చాలా శక్తి కూడగట్టుకో వలసివచ్చింది.

కవరు తీసి లాల్చీ జేబులో పెట్టుకున్నాడు.

డోరు తెరచి క్రిందకి దిగి "కనీసం ఫోను నెంబరు చెప్పు. ఇదివరకు నేను ఉత్తరాలు వ్రాయలేదనుకోకు. పాప బారసాలకు శుభలేఖ వేస్తే తిరిగివచ్చింది"



ఇందాకా ఉత్తరాలు వ్రాయలేదంటూ నిందవేసిన జయ అనుమానం దూరం చేస్తూ అన్నాడు.

"జ్ఞాపకం పెట్టుకో అయితే ఫోర్ టూ జీరో ఫోర్ టూ జీరో"

జేబులో పెన్నుతో కాగితం ఒకటి తీసి వ్రాయబోయి ఆగిపోయాడు సందేహంగా. 'చార్ సౌ బీస్' అంటూ కాలేజీలో తనకి నిక్‌నేమ్ పెట్టింది జయ! అదే నెంబరు విడ గొట్టి సీరియస్‌గా చెబితే.... జయ వైపు తలెత్తి చూసాడు. జయ కళ్ళలో పెదవులపై నవ్వుమెరుస్తోంది.

నవ్వాడు సూర్యం "హాస్యం కాదు జయా నేను మీ ఇంటికి రానులే ఎపుడైనా ఫోను చేయచ్చుగా"

ఇందాకా తనన్న మాటలు తిరిగి తననే అంటున్నాడని గ్రహించి నవ్వుకుంటూ "నేనుండేది ఈ ఊళ్ళో కాదు" అంది తల దించుకుంటూ.

"వస్తాను సూర్యం మరచి పోకేం" చూస్తూండగానే జయ ముఖం మబ్బులు కమ్మిన చందమామలా వాడిపోయినట్లయింది. చిన్నగా చేయి ఊపుతూంటే కారు ముందుకి సాగిపోయింది.

ఏమిటి మరచిపోకూడదు?తను చెప్పిన మాటలనా? తననా?ఏదయినా మరపు అనేది ఈ విషయంలో కాలంతో పోటీ పడలేక ఓడిపోయింది అనుకున్నాడు ఇంటివైపుగా అడుగులు వేస్తూ.

* * *

ఇంటికి వచ్చేసరికి ఫినాయిల్ వేసి ముందు గదంతా కడుగుతోంది సునంద.

"ఏముందీ? డబ్బున్న పొగరు. ఆ మహారాణి జోడుతోనే ఇంట్లోకి వచ్చేసింది. మనకి డబ్బు లేక పోవచ్చు. శుచి శుభ్రతలున్నాయి.ఇంతకీ అయినాయా సాగనంపడాలు వీడ్కోలు ఇవ్వడాలూ?" తీగలాగాలని ప్రయత్నిస్తున్న సునంద మాటలు వినిపించుకోకుండా లోపలి గదిలో కవరు విప్పి చూసాడు. ఇరవై వేల రూపాయలు అన్నీ అయిదు వందల నోట్లలో. ఒక తెల్లకాగితం మీద "సూర్యం దయచేసి కాదనకు. పాప పెళ్ళి కోసం ఈ చిరుకానుక స్వీకరించు" అని వ్రాసి ఉంది.

"ఏమిటది ప్రేమలేఖా" వెనువెంటనే వచ్చిన భార్య గొంతు హేళనగా... "సునందా! నన్నిలా కూడా బ్రతక నివ్వవా" తీక్షణమైన సూర్యం గొంతు వింటూ "బ్రతక నివ్వనిది ఎవరు ఎవరిని? ఆవిడని చేసుకోక మధ్య నా గొంతు ఎందుకు కోసారు, పెద్ద సంబంధం వచ్చింది కాదనుకున్నాం అని మీ అమ్మ అంటే ఏమిటో అనుకున్నా. ఇంతగ్రంధం సాగుతోందని నాకు తెలుసా?"

కూతురున్నముందు గదిలోకి వినిపిస్తుందన్న ధ్యాసలేకుండా గొణుగుతున్న భార్యను పట్టించుకోలేదు సూర్యం. ఆమెకు సూర్యం సంగతి తెలిసి నిందవేయటం ఎప్పటినుంచో అలవాటు చేసుకుంది అన్ని విషయాలలో.

ఎందుకో జయ ఇచ్చిన డబ్బు తనకి ఇబ్బందిగా అనిపించటం లేదు. అది అవసరం పెట్టిన ఆశకాదు, ఆమె అభిమానం. ఆమె మాట ఇదివరకులా కొట్టి పారేయాలనిపించటం లేదు. ఇరవై ఏళ్ళ క్రితం లాగా, ఇప్పటి మనోస్థితి నిబ్బరం అపుడు లేవెందుకనీ? అనుభవమా లేక వీలుపడిన పరిస్థితులా? జీవితం ఎంత చిత్రమైనది? కావలసినది కోరుకునే సమయంలో పరిస్థితులకు తప్పనిసరై తలవంచడం! అవే పరిస్థితులు బలహీనమై మనిషి బలవంతుడైనపుడు కావలసినది ఎంతో దూరంలో వదిలేసి కాలంతో ప్రయాణించడం.

సునంద స్థానంలో జయ! ఉహు అది సాధ్యపడదు. జయది సున్నితమైన మనసు. జీవితం అంటే ఆపేక్ష ఆమెకు! తను ఆమె జీవితం నాశనం చేయలేదు ఆమె మనసారా నవ్వే శక్తి పోగొట్టుకోనీయలేదు! ఆ తృప్తి చాలు "ఆవిడ వెళ్ళి చాలా సేపైంది ఇంక భోజనానికి లేస్తారా" విసుగ్గా సునందగొంతు. సూర్యం తల తిప్పి చూసాడు. జేబులోనున్న కవరు బీరువాలో దాచి వచ్చాడు.

* * *

జెన్ ఫైవ్‌స్టార్ హొటల్ ముందు ఆగింది. అప్పటికే రమణి, ఆమె భర్త పాక్, చేసి సామాను రెడీగా ఉంచారు. జయను చూస్తూనే రమణి 'ఇంక గంటలో వెళ్ళిపోవాలి మనం నువ్వు రెడీగా ఉన్నావు కదూ 'అని అడిగింది. సర్దుకోవాలసింది ఆమె మనస్సు అనే సంగతి రమణికి తెలుసు. రమణి జయ కాలేజీ మేట్స్ గనుక సూర్యం తనకీ తెలుసు. అనుకోకుండా తన భర్త ఫ్రెండ్ కూతురి పెళ్ళిలో కలిసాడు సూర్యం. "వాళ్లమ్మాయి పెళ్లి సంగతి అడిగావా?" "ఆ రెండు నెలల్లో చేద్దా

మనుకుంటున్నారని అన్నాడు సూర్యం"

జయ ముభావంగా ఉండటం చూసి రమణి ఇంక వేరే ప్రశ్నలు వేయలేదు

* * *

ఒక ఏడాది సూర్యం జీవితంలో చాలా మార్పులు తెచ్చింది. తల్లి హఠాత్తుగా జబ్బు చేసి మరణించింది. జయలక్ష్మి పెళ్ళయి దూరంగా హాయిగానే ఉంది.సునంద సాధింపు ఎక్కువైంది. "అందరిళ్ళలో అన్ని హంగులు, మనింట్లో మటుకు..."

సూర్యం ఆఫీసు పని మీద మద్రాసు వచ్చాడు.అక్కడ ఆఫీసు క్రింద ఫ్లోర్‌లో చిన్నప్పటి మిత్రుడు రవీంద్ర కలిసాడు అతడూ ఆఫీసు పనిమీద వచ్చిన వాడే. ఇద్దరూ కలిసి భోజనం చేస్తున్నారు. ఆ రాత్రి, జయ ప్రస్తావన వచ్చింది.

"జయని పెళ్ళిచేసుకోకుండా తప్పుచేసావు సూర్యం" రవీంద్ర అన్నాడు.

"లేదు రవి. జయకి నేను అన్యాయం చేయలేదు. ఆమె హాయిగా జీవిస్తోంది. అంతేచాలు"

"హాయిగానా? అయితే నీకు అసలు విషయం తెలియదా?" ఆశ్చర్యంగా అడిగాడు రవీంద్ర.

"జయ తండ్రి వ్యాపారంలో బాగా నష్టపోయాడు. ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు. జయకు పెళ్ళి సంబంధం కుదిరి పెళ్ళి చేసుకోబోయేటపుడు జరిగింది. వాళ్ళు వెళ్ళిపోయారు. మొదటినించి తనకి పెళ్ళి వద్దు అనే చెబుతూ వచ్చింది. దురదృష్టం తన్నుకు వచ్చింది. ఎవరో దూరపు బంధువులు సినీఫీల్డ్‌లో చిన్న పని చేస్తుంటే వాళ్ళ సాయంతో ఇక్కడకు వచ్చింది. సినిమాల్లో డూప్‌గా నటించేది. ఒకసారెపుడో అలాంటి ప్రమాదకరమైన సీను చేస్తూంటే ఆమె కాలు విరిగిపోయిందిట. కాంపన్సేషన్ సరిగా ఇవ్వలేదు అనుకొన్నారు. అర్టిఫిషియల్ పరికరం అమర్చుకొందిట. ఎవరో దయ తలచి చిన్న క్లెరికల్ ఉద్యోగం ఇచ్చారు. అది చేస్తోంది. అంత డబ్బులో పుట్టి పెరిగి అంత దరిద్రం అనుభవించడం నిజంగా శాపంరా సూర్యం. ఇది తలచుకుంటే నువ్వు ఆనాడు ఆ పిల్లను పెళ్ళిచేసుకుంటే బాగుండిపోను అనుకుంటూంటాను" రవీంద్ర ఆగాడు.

సూర్యం తేరుకోవడానికి కాస్తసేపు పట్టింది. అన్నంతినలేక చేయికడిగేసుకున్నాను. "జయ అడ్రసుందా నీ దగ్గర"

"నా భార్యకి తెలుసు అనుకుంటాను. ఆమె చెప్పింది ఈ వివరాలు. తనకీ జయ ఫ్రెండే, జయ ఫ్రెండ్ సర్కిల్ అ రోజుల్లో డబ్బున్నపుడు, చాలా పెద్దది కదా. నీకు కావాలంటే సంపాదించి ఉత్తరం వ్రాస్తాను." అన్నాడు.

ఆ తరువాత అరగంట జయ గురించి సినీఫీల్డ్ గురించి చెప్పుకుపోయాడు రవీంద్ర. జయ అసలు పెళ్ళేచేసుకోలేదు.

సూర్యం మనసులో రాళ్ళ ఆభరణాలతో కార్లో దిగిన జయరూపం మెదులుతోంది. ఆమె ఇచ్చిన చిరుకానుక ఎంత బరువైందో అర్ధమైంది. సునంద జయ పొగరుబోతు తనాన్ని వర్ణిస్తుంటే జోడుతోటి ఇంట్లోకి ఎందుకు వచ్చిందో అర్ధమైంది, 'మా ఇంటికి నిన్ను ఆహ్వానించను' అంటూ అల్లరిలో నిజాన్ని ఎలా దాచిందో అర్ధం అయింది.

* * *

ఆవేళ జయ పుట్టినరోజు. స్నేహితురాలు రమణి ఇంట్లో గడిపి తీరాలి అని రమణి కోరిక.

"సూర్యం సంగతులు తెలిసాయా ఉత్తరం వ్రాసావా జయా" రమణి అడిగింది ప్లేటులో స్వీటా హాటు సర్ది జయకంచం దగ్గరగా పెట్టింది. "ఆవేళ తరువాత ఉత్తరం వ్రాయలేదు రమణీ. కొన్ని బంధాలు ఎంత దూరంగా ఉంటే అంత బాగుంటాయి. మీ అన్నగారి కారు నీ నగలూ చూసి అందరూ అలా చూస్తూండిపోయి నావే అనుకుని నమ్మారు. థాంక్సు రమణీ! ఆవేషం లేకపోతే సూర్యానికి ఆ డబ్బు ఇవ్వలేకపోయే దానిని. వాళ్ళమ్మాయి పెళ్ళికి కాస్త సహాయం అవుతుందనీ గానీ ఆడబ్బు..."అంటూ ఆగిపోయింది జయ. ఈ డబ్బేగదూ తననీ సూర్యాన్నీ విడదీసింది. "సినిమాలలో నవలలో ఇలాంటి కథలు బాగుంటాయి జయా నిజానికి వాస్తవికతకు వాటిలో చోటులేదు. నువ్వు అమాయకురాలివి నీకు తెలియదు. కాలం బలమైంది జయా! దానికెదురు నిల్చిన వారేరీ? నువ్వు దానికి బలికావటం నా కిష్టంలేదు. నీకిపుడు నచ్చకపోవచ్చు, నేను మంచిపనే చేస్తున్నానని నా నమ్మకం. నువ్వూ అలాగే అనుకుంటావని నా విశ్వాసం' ఊరికి వెళ్ళబోతూ. సూర్యం అన్నమాటలు ఇప్పటికీ తన గుండెలో మారుమ్రోగుతాయి.

"ఓ జయా" రమణీ పిలుపుకు ఇటు చూసింది. "ఏమిటి ఆలోచిస్తూ ఉండిపోయావు తినూ" అంది.

స్పూన్‌తో నెమ్మదిగా తింటోంది జయ, ఆమె కళ్ళకి నీటిపొర అడ్డంగా మసకగా. రమణి గమనించ లేదు. "ఆవేళ నువ్వు ఈ వస్తువులు కావాలి అని అడుగుతూంటే ఎంతో ఆశ్చర్యపడ్డాను. నేనిచ్చే డబ్బు నీకిష్టం లేదు,చీమలా కష్టపడి కూడపెట్టిన డబ్బు అంతా అలా ఇచ్చేసావు జయా! సూర్యం అంటే నీకెంత అభిమానమో! అతడు పిరికివాడు కాబట్టే నిన్ను పెళ్ళి చేసుకోకుండా ఏవో కబుర్లు చెప్పి పారిపోయాడు" అంది రమణి. "లేదు రమణి! సూర్యాన్ని నువ్వు అర్ధం చేసుకోలేదు. అతడు ప్రాక్టికల్ మనిషి," జయ అంది.

"అది సరేలే! నీకు ఏ విధంగానైనా ఉపయోగపడితే నా జన్మ ధన్యం అయిందనుకుంటాను. ఇంక మొండి పట్టుదల మాని నా దగ్గరకు రా! లంకంత ఇల్లు! నాకు మాత్రం ఎవరున్నారనీ! నా భర్త పిల్లలూ డబ్బు మనుష్యులు. డబ్బు తప్ప ప్రపంచంలో మనిషిపొందగలిగేది ఎన్నో ఉన్నాయన్నా నమ్మని వాళ్ళు," రమణి ఆర్తిగా అడిగింది.

"రమణీ" జయపిలుపులో ఎంత మార్దవం. స్నేహితురాలు తన పట్ల చూపిస్తున్న శ్రద్ధకి కృతజ్ఞత తొణికిసలాడుతోంది.

"నేను నేనుగా నా మనస్సులో సూర్యం తోడుగా జీవించే ఈ బ్రతుకు చాలా అపురూపమైనది. అపై నీ స్నేహం! నాకింకేం కావాలి చెప్పు?" అంది జయ.

ఆవేళ అక్కడే గడిపి ఆ మరునాడు తన గదికి వెళ్ళింది జయ.

"నిన్న నీ పేరున రిజష్టర్డ్ లెటర్ వచ్చింది జయా సంతకం పెట్టి నేను తీసుకున్నానమ్మా" అంటూ ఇంటి గలావిడ ఒక కవరు ఇచ్చింది.

అది యభై వేల రూయలకు డిమాండ్ డ్రాఫ్ట్, ఏటా ఒక నటుడు అజ్ఞాతంగా డూప్‌గా నటించి నష్టపోయేవారికి కానుకగా ఇస్తాడు. ఈ సారి వాళ్ళలో జయ కూడా ఉంది. జయ వెంటనే ఆ సంతోష వార్త పంచుకోవాలని వెంటనే రమణి ఇంటికి బయలు దేరింది. 'గుడ్‌న్యూస్' అంటూ జయ చెప్పింది విని రమణి జయ చేయి చేతిలోకి తీసుకుంది ఆప్యాయంగా,

"నువ్వీ కానుకకి అసలైన అర్హురాలివి జయా! ఎన్నాళ్ళ నుంచో ఉన్న నీ కోరిక తీరుతుందేమో! అరడజను కుట్టు మిషన్లుకొని కొంతమందికి ఉపాధి కలిగించడమూ ఒక బొటీక్ తెరవాలని నీ కోరిక కదూ." "ఇంతకీ ఆ బొటీక్ పేరేమిటో తెలుసా?" జయ కళ్ళలో ఒక్కసారి వేయి విద్యుల్లతలు మెరిసినట్లయింది చూస్తున్న రమణికి, "తెలుసు తల్లీ, ఆ మహానుభావుడు అదే ఆ సూర్యంగారి పేరు అవునా?" నవ్వుతూ తల ఊపింది జయ.

* * *

"ఎన్నిసార్లడిగినా మాట్లాడరేం? ఎకరం లక్షకుపైగా పలికే భూమి అది. ఇంకో యాభైవేలన్నారావాలి అడబ్బేదీ?" సునంద తారస్థాయిలో అరుస్తోంది. "యాభైవేల రూపాయల పొమ్ము ఎక్కడ తగలేసారు?"

తగాదాలు తీరి పొలం అమ్మగా వచ్చిన డబ్బుతో టివీ, ఫ్రిడ్జ్ రెండు జతల గాజులు ఒక నెక్లసూ చేయించుకుంది సునంద.

"సునందా ఆ పొలం తగాదాల్లో ఉంది. మనదాకా వస్తుందని అనుకున్నామా? రాలేదనుకో! ప్లీజ్ మర్చిపో! మనకి అన్నానికి లోటు లేదు" నెమ్మదిగా అంటున్నాడు సూర్యం. నిజాన్ని విని తట్టుకునేంత విశాలహృదయం ఆమెకు లేదు. స్వచ్ఛమైన స్నేహం అంగీకరించలేని ఇరుకు మనస్తత్వం. అందుచేత ఆ యాభై వేలు ఏమైనాయో ఆమెకు చెప్పటం వృథా అని ఆమెకు చెప్పడు సూర్యం.

"అంతే అలాగే అనుకోవాలి నా ఖర్మ ఇంతే! జీవితంలో ఓ సరదా ఓ ముచ్చటా లేవు" ఆ ఇంట్లో ఏ గోడను కదిలించినా మిగతా సునంద చెప్పే మాటలు చెప్పేయగలవు. ❐

**కరెంటు బిల్లు**

"అరె మీ మీటర్ వర్క్ చేస్తున్నట్టు లేదే. క్రిందటి నెలకి ఈ నెలకి అసలు పొంతనే లేదు" అన్నాడు రీడింగ్ తీసి కోవటానికని వచ్చిన ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి.

" అసలు మీరు పవర్‌యిస్తూంటే కదా. మా మీటర్లు తిరగటానికి" అన్నాడు కసిగా యింటాయన.

\- పచ్చిగోళ్ల రోహిణి